ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 5 ఆగస్టు 2025



- సాగర్ కుడి కాల్వకు 7,500 క్యూసెక్కులు
- కాల్వలకు సాగు నీటి కళ
- వ్యవసాయ పనుల్లో తీరిక లేని రైతులు

పుష్కలం..!



గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో నీటి ప్రవాహం

చిలకలూరిపేట మేజర్‌లో పరవళ్లు..

గోవిందపురం మైనర్‌కు నీటి సరఫరా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
కృష్ణమ్మ సాగర్ కుడి కాల్వలో పరవళ్లు తొక్కుతోంది. జలవనరుల శాఖ పుష్కలంగా సాగు నీటిని విడుదల చేస్తోంది. బ్రాంచ్ కాల్వల నుంచి మైనర్ కాల్వల వరకు జలకళను సంతరించుకున్నాయి. దాదాపు అన్ని కాల్వలకు నీటి సరఫరా చేస్తుండటంతో పంటల సాగు ఊపందుకుంది. ఇప్పటికే వరి నారుమళ్లు పోసుకున్న రైతులు.. రానున్న పది రోజుల్లో వరినాట్లు పూర్తి స్థాయిలో ప్రారంభించనున్నారు. నకరికల్లు, రాజుపాలెం మండలాల్లోని పలు ప్రాంతాల్లో వరినాట్లు ప్రారంభమయ్యాయి. అలాగే..వర్షాభావం నెలకొన్న 15 మండలాల్లో సాగర్ నీటితో పంటల సాగు చేపట్టారు. కంది, మొక్కజొన్న, మిరప పంటలను సాగు చేస్తున్నారు. పంటల సాగులో అన్నదాతలు తీరికలేకుండా ఉన్నారు. ట్రాక్టర్ల నిర్వాహకులకు చేతి నిండ పని లభిస్తోంది. వ్యవసాయ కార్మికులకు పుష్కలంగా పనులు దొరుకుతున్నాయి. సాగర్ డ్యాం నుంచి జవహర్ కుడికాల్వకు 7,500 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి కుడికాల్వకు 7,500 కూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. బ్రాంచ్ కెనాల్స్ మేజర్ కాల్వలపై ఉన్న విద్యుత్ ప్లాంట్‌లలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.



నకరికల్లు మండలంలో వరి నారుమడి



బాలయ్య నగర్‌లో మట్టి రోడ్డు

విలీన వెతలు!

నరసరావుపేట మునిసిపాలిటీ విలీన శివారు ప్రాంతాలు త్రిశంకు స్వర్గంలో విహరిస్తున్నాయి. రెండిటికీ చెడ్డ రేవడిలా ఇక్కడి పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా ఈ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదు. నరసరావుపేట మునిసిపాలిటీలో శివారు ప్రాంతాలను విలీనం చేసి.. గత వైసీపీ ప్రభుత్వం చేతులు దులుపుకుంది. విలీన తదుపరి చర్యలు ఆ ప్రభుత్వం విస్మరించింది. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మౌలిక వసతుల కల్పనను పాలకులు విస్మరించారు. పన్ను విషయంలో నెలకొన్న సందిగ్ధత.. ఆయా ప్రాంతాల్లో నివసించే వారికి బ్యాంకు రుణం కూడా లభించని.. పరిస్థితి తీసుకొచ్చింది.

వసతులు కరువాయో!

విలీన ప్రాంతాలకు కనీస వసతులు మునిసిపాలిటీ కల్పించడం లేదు. పారిశుధ్య సమస్యలను స్థానికులు ఎదుర్కొంటున్నారు. మురుగు కాల్వలు లేక అవస్థలు పడుతున్నారు. వీధి దీపాలకు వారు నోచుకోవడం లేదు. మట్టి రోడ్లతో ఇక్కట్లు పడుతున్నారు. కనీసం తాగునీటి కొళాయి కనెక్షన్లు ఇవ్వడం లేదు. పన్ను వసూలుపై స్పష్టత వచ్చే వరకు కొత్త కుళాయి కనెక్షన్లు లేనట్లే. మౌలిక వసతులు కల్పించాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల సమస్య

- మూడేళ్లుగా నిలిచిన పన్ను వసూళ్లు
- పంచాయతీలు కాదు పొమ్మంటున్నాయి
- పురపాలక సంఘం పట్టించు కోదు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): రావిపాడు, కేసానుపల్లి, యలమందల, ఇస్సపాలెం, లింగంగుంట్ల పంచాయతీల పరిధిలోని పలు ప్రాంతాలను నరసరావుపేట మునిసిపాల్టీలో విలీనం చేశారు. ఇక్కడ ఆస్తి పన్ను వసూలు నిలిచిపోయింది. దాదాపు 4,900 అసెస్మెంట్‌ల పన్ను వసూలు మూడేళ్లుగా నిలిపి వేశారు. విలీన ప్రభావంతో ఆయా పంచాయ తీలు, ము నిసి పాలిటీకి ఎన్నికలు కూ డా నిలి చిపో యాయి. ఇంటి పన్ను లేనిదే బ్యాంకుల్లో రుణం లభించే పరి స్థితి లేదు. 2022 ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి విలీన ప్రాంతాలు మునిసిపాలిటీ పరిధిలోకి వచ్చాయి. ఈ మేరకు పంచాయతీలు సంబంధిత రికార్డులను పురపాలక సంఘానికి అప్పగించాయి.

రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం పన్ను

విలీన ప్రాంతాల్లో ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా పన్ను విధించాల్సి (మిగతా 6వ పేజీలో)




నరసరావుపేట మునిసిపాల్టీలో విలీనమైన రావిపాడు ఏరియా



జీవనాడికి జవసత్త్వాలు

- వరికపూడిశెల కల సాకారం చేసిన సీఎంకు రుణపడి ఉంటాం 8
- రైతు బాంధవులు బ్రహ్మానందరెడ్డి, లావుకు కృతజ్ఞతలు
- ప్రాజెక్ట్ వద్ద జలసాధన సమితి సభ్యుల క్షీరాభిషేకం

రాజధాని రైతులకు.. రిటర్న్ గిఫ్ట్!



- రిటర్నబుల్ ప్లాట్లపై బ్యాంకు రుణాలకు మోక్షం
- అన్ని బ్రాంచ్‌ల అధికారులకు లీడ్ బ్యాంకు ఆదేశం
- ఫలించిన రైతుల సుదీర్ఘ పోరాటం !
- అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు భారీ ఊరట!

గుంటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం భూములిచ్చిన రైతుల రుణ కష్టాలు తీరాయి. ప్రభుత్వం ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లపై రుణాలిచ్చేందుకు ఎట్టకేలకు బ్యాంకులు ముందుకు వచ్చాయి. దీంతో రైతులను ఏళ్ల తరబడి వెంటాడుతున్న దా'రుణ' కష్టాల నుంచి బయటపడి ఊపిరి పీల్చుకునే అవకాశం దొరికినట్లయింది.

- సీఎం చొరవతో రుణ సదుపాయం

రాజధాని కోసం వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రిటర్నబుల్ ప్లాట్లు (మిగతా 6వ పేజీలో)



నూతన సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న ఐజీ త్రిపాఠి

పోలీసు సమీక్షలకు..కాన్ఫరెన్స్ హాలు కీలకం

- ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

నరసరావుపేట లీగల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో నిర్మించిన ఆధునిక కాన్ఫరెన్స్ భవనాన్ని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సోమవారం ప్రారంభించారు. ఐజీకి జిల్లా పోలీసు అధికారులు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఐజీ త్రిపాఠి మాట్లాడుతూ కాన్ఫరెన్స్ హాల్ పోలీస్ శాఖకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్రైమ్ రివ్యూలు, అంతర్గత సమావేశాలు, శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లాకు చెందిన ముఖ్య అధికారులతో కలిసి మొదటి నేర సమీక్షను నూతన హాలులో నిర్వహించారు. కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ.. కాన్ఫరెన్స్ హాలు ద్వారా ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు బ్యాంకర్లతో భద్రతా సమీక్ష సమావేశాన్ని ప్రారంభ కార్యక్రమంగా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం భవన నిర్మాణానికి కృషి చేసిన పోలీసు అధికారులను, కలెక్టర్‌ను శాలువాతో ఐజీ సత్కరించారు.

12న మద్దిరాలలో జాబ్ మేళా

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న మద్దిరాలలోని సాదినేని చౌదరయ్య కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీ రావు సోమవారం తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే పాల్గొని, మాట్లాడారు. ఈ జాబ్ మేళాలో సూమారు 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్హతలను బట్టి ఎంపికైన వారికి జీతం రూ.10వేల నుంచి రూ.30వేల వరకు ఉంటుందన్నారు. జాబ్ మేళా గోడప్రతులను ఆవిష్కరించారు. 45 ఏళ్లలోపు వయసు కలిగి.. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విద్యార్హత కలిగిన నిరుద్యోగులు ధ్రువపత్రాలతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు జె.సురేష్ (91005 66581), ఎం.వీరాంజనేయులు(91602 00652), ఎ.రమ్య (77029 21219) నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా జాషువా జయంత్యుత్సవాలు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పేదరికం సహనాన్ని, కుల వివక్షను ఎదురించి పోరాడే తత్వాన్ని తనకు నేర్పాయని గుర్రం జాషువా అన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. సోమవారం పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల నుంచి జమీందారు పంక్షన్ హాలు వరకు బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న మాధవ్ స్థానిక గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహోన్నత శిఖరం గుర్రం జాషువాకు నివాళులర్పించి నరసరావుపేట జిల్లా పర్యటన ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సెప్టెంబరు 28న బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా గుర్రం జాషువా జయంతి ఉత్సావాలు నిర్వ హిస్తుందని చెప్పారు. నిరుపేద కుటుంబంలో పుట్టి వివక్షకు గురై కూడా గుర్రం జాషువా.. తిరుపతి వేంకట కవుల ద్వారా గండపెండేరాన్ని ధరించడం, అశ్వవాహనంలో ఊరేగడం, ఆయనతో పాటు అప్పటి ముఖ్యమంత్రి బెజవాడ గోపాల కృష్ణారెడ్డి కూడా రావడం ఒక మహత్తరమని మాధవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేలూరి శశికుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.దయాకర్‌రెడ్డి, ఎ.సుధాకర్ బాబు, పాతూరి నాగభూషణం, హనుమంతరావు, కె.సుబ్బారావు, చిరుమావిళ్ల అదినారాయణ తదితరులు పాల్గొన్నారు.




జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాధవ్ తదితరులు

నులిపురుగుల నివారణ దినోత్సవం

గోడ ప్రతుల ఆవిష్కరణ

నరసరావుపేట లీగల్, ఆగస్టు 4,(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబు ప్రచార గోడ ప్రతులను ఆవిష్కరించారు. భారత ప్రభుత్వం ఆదేశించిన విధంగా ఏడాది నుంచి 19 ఏళ్లలోపు బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ సూరజ్ గనోరే, డాక్టర్ రవి పాల్గొన్నారు.



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు తదితరులు

త్రికరణ శుద్ధిగా.. హర్ ఘర్ తిరంగా



- మూడు దశల్లో కార్యక్రమాల నిర్వహణ
- ప్రతీ ఇంటిపై జాతీయ జెండా రెపరెపలు..
- జిల్లా స్థాయిలో ఒక భారీ కార్యక్రమానికి ఆదేశాలు

చిన్ని గుండెకు పెద్దకష్టం

- ఆపరేషన్ ఖర్చులకు దాతల కోసం ఎదురు చూపు

8

షూటింగ్ బాల్ బాల బాలికల జిల్లా జట్లు ఎంపీ

6

10 రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు

బోగస్ పింఛన్ల.. లెక్క తేలేదెన్నడు?



గుత్తికొండలో జనవరి 6న పింఛన్‌ల వెరిఫికేషన్ చేస్తున్న వైద్యాధికారులు (పాత చిత్రం)

- దివ్యాంగ పింఛన్లపై పూర్తయిన రీవెరిఫికేషన్..
- ప్రభుత్వానికి నివేదికిచ్చి.. మూడు నెలలు
- అనర్హులవి రద్దయితేనే.. కొత్తవి

పిడుగురాళ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన బోగస్ దివ్యాంగ పింఛన్ల లెక్క తేల్చాలని.. దివ్యాంగులు కోరుతున్నారు. అనర్హులను గుర్తించి, తొలగిస్తే.. అర్హులకు ఆ పింఛన్లు మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. అంతే కాకుండా ప్రభుత్వానికి కూడా ఆర్థిక భారం తగ్గుతుందని కోరుతున్నారు. జూలై 1 నాటికి పల్నాడు జిల్లాలో 21,446 మంది దివ్యాంగ పింఛన్‌దారులు ఉన్నారు. వీరిలో 50 శాతానికి పైగా అన్ని బాగున్నా పింఛన్ పొందుతున్నట్లు రీవెరిఫి కేషన్‌లో గుర్తించినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక దివ్యాంగ పిం ఛన్లను రీ వెరిఫికేషన్ చేయించింది. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభు త్వ ఏరియా వైద్యశాలల్లో మరో డివిజన్‌కు చెందిన వైద్యాధికారులు లబ్ధిదారుల ప్రతి సర్టిఫికెట్‌ను, అంగవైకల్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేసి మూడు నెలలు గడుస్తున్నా.. వాటిపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోకపోవడం.. అనర్హులు ఇంకా పింఛన్లు పొందుతుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీ హయాంలో అనర్హులకు పింఛన్లు..

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన బోగస్ పింఛన్ల మంజూరుతో ప్రభుత్వంపై అదనపు భార పడుతోంది. గత ప్రభుత్వంలో సదరన్ సర్టిఫికెట్‌తో పింఛను కోసం సచివాలయాల్లో దివ్యాంగ పింఛనుకు దరఖాస్తు చేసుకుంటే.. క్షణాల్లో జిల్లాలోని నకరికల్లు, మాచర్ల, గుంటూరులో ఉన్న కొందరు దళారులకు తెలిసిపోయేది. దరఖాస్తులోని ఫోన్ నంబర్ల ఆధారంగా వారు అర్జీదారు లకు ఫోన్ చేస్తారు. దరఖాస్తుదారు అడి గిన పర్సంటేజీతో సర్టిఫికెట్ ఇంటికే వచ్చేలా చేస్తామని..బేరసారాలు మొదలు పెడతారు. అవసరాన్ని బట్టి రూ.10 నుంచి రూ.20 వేలు తీసుకున్నారు. కొంద రు స్లాట్ బుక్ చేసుకుని.. వైద్యులను సం ప్రదించినా.. వారు తగిన అంగ వైకల్యం పర్సంటేజ్ లేకుండానే సర్టిఫికెట్ జారీచేయడంతో..ఆ సదరం సర్టిఫికెట్లు ఉపయోగం లేకుండా పోయాయి. మరో సారి దళారుల ద్వారా రూ.15 వేలు ఇచ్చి సర్టిఫికెట్లు పొందిన వారు జిల్లాలో చాలా మందే ఉంది.

ఎం-బుక్కులు ఏమయ్యాయి?

పిడుగురాళ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన కొన్ని ఎం-బుక్‌లు మాయమయ్యాయి. 2014- 19 మధ్య కాలంలో మండలంలోని వీరాపురం, గుత్తికొండ, జానపాడు, పెద అగ్రహారంతో పాటు మరి కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు చేపట్టిన పనులకు కొందరికి నగదు జమ అయ్యాయి. 2019 తర్వాత వారు చేసిన పనులకు సంబంధించి ఎం-బుక్‌లు కనిపించకుండా పోయాయి. ఈ విషయాన్ని మాజీ సర్పంచ్‌లు పంచాయతీ రాజ్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. వైసీపీ హయాంలోని ప్రజాప్రతినిధులే.. వాటిని కావాలని మాయం చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎం-బుక్‌లు ఎక్కడ ఉన్నాయో తెలియక.. రూ.లక్షల్లో నష్టపోవాల్సిన పరిస్థితి ఉందని మాజీ సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వీఆర్వోకి వైసీపీ నాయకుడి బెదిరింపులు

బొల్లాపల్లి, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేమిడిచర్ల గ్రామ ఇన్‌చార్జి వీఆర్వో గంధం అరుణ్‌రెడ్డిపై బొల్లాపల్లి మండల వైసీపీ కన్వీనర్ కాకర్ల నారాయణ రెడ్డి బెదిరింపులకు దిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఒక సర్టిఫికెట్ విషయంలో వీఆర్వో అరుణ్‌రెడ్డికి ఫోన్ చేసిన కాకర్ల నారాయణరెడ్డి బూతులు తిడుతూ తనకు వెంటనే సర్టిఫికెట్ తెచ్చివ్వాలని, లేకుంటే సచివాయాలనికి గుమ్మడికాయ మాదిరిగా ఉరివేసి వేలాడదీస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. తాను వినుకొండ నుంచి నర్సరావుపేటకు వెళ్తున్నానని వీఆర్వో చెబుతున్నా.. వినకుండా వెంటనే వెనుక్కి వచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలని లేకుంటే అంతు చూస్తానని బెదిరించాడు. వీరికి సంభాషణకు సంబంధించిన ఆడియో రికార్డు రెండ్రోజుల నుంచి సామాజిక మాధ్యమాల్లో రావడంతో వైసీపీ నేతపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. వీఆర్వో అరుణ్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో దీనిపై తహసీల్దార్ సుధాకర్‌ను వివరణ కోరగా.. వీఆర్వో అరుణ్‌రెడ్డి వైసీపీ నేత బెదిరింపులపై బొల్లాపల్లి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడని తెలిపారు.

బాలుడు మృతదేహం లభ్యం

విజయపురిసౌత్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలంలోని పర్యాటక ప్రాంతమైన ఎత్తిపోతల జలపాతంలో గత ఆదివారం ఈతకు వెళ్లి గల్లంతైన బాలుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. తెలంగాణలోని మిర్యాలగూడకు చెందిన షేక్ సమీర్ (17) స్నేహితుడు నజీర్‌తో కలిసి నాగార్జున సాగర్ డ్యాం తిలకించేందుకు వచ్చాడు. అనంతరం ఎత్తిపోతల చేరుకొని అక్కడ రంగనాథస్వామి ఆలయ సమీపంలోని ఎత్తిపోతల జలపాతంలో ఈతకు దిగారు. సమీర్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. నజీర్ ఈత కొడుతూ సురక్షితంగా బయటపడ్డాడు. మృతుడు సమీర్ తండ్రి గౌస్‌మియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్‌ఐ అశోక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అదృశ్యమైన వివాహిత దారుణ హత్య


శనివారం మధ్యాహ్నం భర్తతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మృతురాలు మేరి

నర్సరావుపేట లీగల్/నకరికల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 2న అదృశ్యమైన ఓ వివాహిత ఆమె భర్త చేతిలో దారుణంగా హత్యకు గురైంది. నరసరావుపేటకు చెందిన ఓ మహిళను ఆమె భర్త నకరికల్లు శివారులోని దుప్పులు కొండ వద్ద హత్య చేసిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. నరసరా వుపేట వన్ టౌన్ సీఐ చరణ్ తెలిపిన వివరాల మేరకు.. తొరటి మేరీ తల్లి కోటేశ్వరమ్మ శనివారం రోజు తన కూతురు కనిపించడం లేదని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ చరణ్ తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టి.. నకరికల్లు శివారులోని రైల్వే ట్రాక్ పక్కన మేరీ మృతదేహాన్ని కనుగొన్నారు. నరసరావుపేటకు చెందిన తొరటి మేరీ కి (29) సత్తెనపల్లి మండలం గార్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రమేష్‌తో ఆరేళ్ల క్రితం మేరీకి పెళ్లి జరిగింది. కాగా వీరికి ఇద్దరు కొడుకులున్నారు. పెళ్లైన ఐదు నెలల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతూ ఉండగా శనివారం మధ్యాహ్నం మేరీని ద్విచక్ర వాహనంపై రమేష్ తీసుకొని వెళ్లినట్లు సీసీ టీవీ ఫుటేజ్ లో పోలీసులు గుర్తించారు. నరసరావుపేట డీఎస్పీ ఎం.వెంకట రమణ నరసరావుపేట వన్ టౌన్ సీఐ చరణ్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూములు త్యాగం చేసిన రైతులకు పాదాభివందనాలు

మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్


కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను అందజేస్తున్న మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే.. ప్రజలు సుఖ శాంతులతో ఉన్నారని, గత వైసీపీ ప్రభుత్వంలో శాంతి భద్రతలు కరువై.. రాష్ట్రం అతలాకుతలం అయ్యిందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం తుళ్ళూరు మండలం తాళ్లాయపాలెం గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి అమలు అవుతున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి వివరించారు. కూటమి ప్రభుత్వ పాలనపై సంతృప్తి గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని అమరావతి ప్రాంతంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయంపై ఆధారపడే రైతులు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నమ్మి తమ కన్న తల్లి లాంటి భూమిని రాష్ట్రం కోసం ఇవ్వడం ఓ చరిత్రగా అభి వర్ణించారు. 2019లో కూడా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి ఉంటే మన రాజధాని మరింతగా అభివృద్ధి చెంది ఉండేదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు.. రైతులు ఎన్ని ఇబ్బందులు పడ్డారో స్వయంగా చూసామన్నారు. రాజధాని మహిళలు అని కూడా చూడకుండా పోలీసులతో అత్యంత అమానుషంగా వ్యవహరించిన రోజులు ఇంకా కళ్ళ ముందే ఉన్నాయన్నారు. మొదలుపెట్టిన పనులు పూర్తి చేయకుండా రాజధాని ప్రాంతాన్ని ఓ అడవిగా మార్చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది అయితే, అమరావతే రాజధానిని అభివృద్ధి పథంలో నడపడం చంద్రబాబు నాయుడు నైజమన్నారు. భవిష్యత్తులో ఎవరూ రాజధానిపై పిచ్చి నిర్ణయాలు తీసుకోకుండా ఉండేలా రాబోయే రోజుల్లో అభివృద్ధి రగబోతుందన్నారు. రాష్ట్ర రాజధాని కోసం సొంత భూములను త్యాగం చేసిన రైతు సోదరులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమన్నారు. అభివృద్ధి చెందుతుంటే.. అడ్డుకోవాలని వైసీపీ నాయకులు చూడడం దారుణమన్నారు. అటు సంక్షేమం ఇటు అభివృద్ధి రెండు కళ్లు అని చెప్పి సీఎం చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని పేర్కొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.


మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య


విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఒడిదుడుకుల్ని అధిగమిస్తేనే నిజమైన జీవితం

విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యువత ఒడిదుడుకుల్ని అధిగమిస్తేనే జీవితంలో గెలుస్తారని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నుంచి బీటెక్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభం సందర్భంగా.. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌన్సెలింగ్‌లో తమ కళాశాలను ఎంచుకున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. కళాశాల పంచ సూత్రాలు (1.ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్, 2. ప్లానింగ్, ట్రైనింగ్, కమ్యూనికేషన్, 3. కౌన్సెలింగ్, 4. సీఆర్‌టీ తరగతులు, 5. బోధన పద్ధతి) వల్లే తమ దగ్గర చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థా నాలను అధిరోహిస్తున్నారని లావు రత్తయ్య వివరించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఫిజికల్ ఫిట్‌నెస్‌కు క్రెడిట్స్‌ను అందిస్తు న్నామని వెల్లడించారు. వర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి మాట్లాడుతూ కౌన్సెలింగ్ సిస్టం ద్వారా ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడిని నియమిస్తామని చెప్పారు. దీంతో విద్యార్థులను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ.. నైపుణ్యాలను వెలికి తీసి పరిపూర్ణ వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడుతామన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్రకు మార్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తే.. ఊడ్చేశారు!

122 గ్రాముల బంగారు నగలు, రూ.20 వేల నగదు చోరీ

రెంటచింతల,ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రెంటచింతలలోని రేంజర్ వీధిలో(రైస్ మిల్ వద్ద) ఆదివారం రాత్రి టీచర్ల గృహంలో భారీ దొంగతనం జరిగింది. దంపతులిద్దరూ ఊరెళ్లడంతో.. దొంగలు ఇనుప రాడ్‌తో తాళాలు, బీరువాను పగలకొట్టి బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్లారు. సేకరించిన వివరాల మేరకు.. గెల్లిపోగు జనార్దనరావు, సుమతి గ్రేస్ భార్యభర్తలు. జనార్దనరావు జెట్టిపాలెం మోడల్ స్కూల్‌లో ఎకనామిక్స్ అధ్యాపకుడిగా.. సుమతి గ్రేస్ స్థానిక విద్యాశాఖలో సీఆర్పీగా పనిచేస్తున్నారు. జనార్దన్ తల్లి మరియమ్మ అస్వస్థతకు లోనుకావడంతో.. పలకరించేందుకు..వారు మాచర్లకు వెళ్లారు. ఉదయం రెంట ఇంటికి వచ్చి చూడగా.. తాళాలు పగలకొట్టి తలుపులు, బీరువా తెరిచి ఉండడం గమనించారు. చోరీ జరిగినట్లు నిర్ధారించకున్నారు. బీరువాలో ఉంచిన శంకరాభరణం బుట్టలు, హ్యాంగర్స్, చైన్లు, ఉంగరాలు, కెంపుల పచ్చల బుట్టలు దాదాపు 122 గ్రామల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని తెలిపారు. అలాగే పాపకు టెన్త్‌లో మంచి మార్కులు రావడంతో పాఠశాల నుంచి వచ్చిన బహుమతి రూ.20 వేల నగదును పట్టుకుపోయారని తెలిపారు. ఘటన స్థలాన్ని కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ నాగార్జున సందర్శించి బాధితుల నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు. అలాగే గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గతంలో బావమరిది ఇంటిలో..

జనార్దన మాస్టార్ బావమర్ది ప్రసాద్ మాస్టర్ గృహంలో కూడా 2022 ఆగస్టు 19న దొంగతన జరిగింది. భార్యభర్తలిద్దరూ స్కూల్‌కు వెళ్లి ఇటికొచ్చేసరికి రూ.3.45 లక్షలు విలువైన బంగారం, నగలు అపహరించుకెళ్లారు. మిర్యాలగూడకు చెందిన నేరస్తుడిని అప్పటి ఎస్‌ఐ సమీర్ బాష పట్టుకుని కొంత సొమ్మును రికవరీ చేశారు.


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

రెంటచింతలలో తచ్చాడిన పాత నేరస్తులు

గతంలో దొంగతనాలకు పాల్పడి జైలు జీవితం గడిపి బయటకు వచ్చిన వారు మూడు రోజుల క్రితం రెంటచింతలలో సంచరించినట్లు సమాచారం. పగలు రెక్కీ..రాత్రిళ్ల చోరీలే వారి పని. ఈ ఏడాది ఫిబ్రవరి 17న మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి గృహంతో పాటు వ్యాపారి సాంబశివరాలు ఇంటిలోనూ చోరీ జరిగింది. అలాగే 2019 ఆగస్టు 11న రాము మాస్టారు ఇంటిలో చోరీ జరగ్గా సుమారు రూ.10 లక్షలు విలువైన బంగారం, నగదు అపహరణకు గురయ్యాయి. ఆ చోరీ మిస్టరీ నేటికి వీడలేదు.

షూటింగ్ బాల్ బాలబాలికల జిల్లా జట్లు ఎంపిక


షూటింగ్ బాల్ బాలబాలికల జిల్లా జట్లు

సత్తెనపల్లిరూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో పల్నాడు జిల్లా జూనియర్ బాలబాలికల షూటింగ్ బాల్ జట్ల ఎంపికలు సోమవారం నిర్వహించారు. బాలురు 80, బాలికలు 60 మంది ఎంపికలకు హాజరయ్యారని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముష్వ నరసింహా రావు, కొనంకి కిరణ్ కుమార్ తెలిపారు. ప్రతిభ ఆధారంగా జిల్లా జట్ల ను ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరు ఈ నెల నెల్లూరు జిల్లా బుచ్చిరె డ్డిపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికలో వ్యాయమ ఉపాధ్యా యులు లాకు పిచ్చయ్య, బి.అనిల్‌దత్తా నాయక్, షేక్ మహబూబి, బి.తులసీరాం నాయక్, ఎ.చిన్నయ్య, తిరుపతమ్మ రత్నకర్, ప్రసన్న, శివరామక్రిష్ణ పాల్గొన్నారు.

బాలుర జట్టు: కె.వెంకటత్, జి.నవీన్, పి.మోహన్, బి.రుషి, జి.వెంకటేష్, షేక్ అబ్దుల్, ఎం.హఫీద్, ఎం.మహీధర్, జె.ప్రవీణ్, జి.మంజీ, కె.సుధీర్, ఎస్.బార్గవ్

బాలికల జట్టు: ఎం.విజయపరిమళ, కె.హిమబిందు, జె.లక్ష్మీకీర్తన, జె.యశ్వస్విని, పి.మేఘన, పి.సుచరిత, ఎం.నందిని, సీహెచ్ అక్షర, కె.హర్షిత, టి.సింధు, ఎం.జ్యోతిక, ఎస్.మధు.

బెదిరించి గ్రావెల్ తరలించారు

● అడ్డుకోబోతే చంపేస్తామన్నారు ● రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితులు


గ్రావెల్ తవ్వకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మధుబాబు, రెవెన్యూ అధికారులు

పిడుగురాళ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అధికారం అండ చూసుకొని కొందరు వైసీపీ నేతలు రెచ్చిపోయారు. దళితుల భూములలో మట్టి తవ్వకాలు జరిపి జేబులు నింపుకున్నారు. కాదని అడ్డొస్తే చంపేస్తా మని బెదిరించారు. కోనంకికి చెందిన దళితులు తెలిపిన వివరాల ప్రకారం.. 2013లో 7వ విడత జన్మభూమిలో కోనంకి సర్వే నెంబరు 236/19లో సుమారు 21 మంది దళితులకు ఒక్కొక్కరికి ఎకరం చొప్పు న అప్పటి టీడీపీ హయాంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేతులమీదుగా భూ పంపిణీ చేయడం జరిగింది. భూమి సాగు చేసు కుంటూ జీవిస్తున్న వారి భూముల్లో 2019-24 మధ్య కొందరు వైసీపీ నేతలు దళితులకు పంపిణీ చేసిన భూమిలో గ్రావెల్‌ను అక్రమంగా తొవ్వి పిడుగురాళ్ల సమీపంలోని అద్దంకి-నార్కె ట్‌పల్లి రాష్ట్ర రహదారి నిర్మాణానికి తోలించారు. తమ భూముల్లో మట్టి ఎందుకు తొవ్వుతు న్నారని దళితులు అడుగగా.. బెదిరింపులకు పాల్పడటమే కాకుండా అడ్డొచ్చిన వారిని పక్కకు నెట్టేసి గ్రావెల్‌ను వందల ట్రక్కులను తర లించారని బాధితులు లంజేపల్లి సువర్ణ, చినమార్తమ్మ, పెదమార్తమ్మ, ఆలేటి కోటమ్మ, లంజేపల్లి లేయమ్మ, నందిపాటి దుర్గమ్మలు రెవెన్యూ అధికారులకు తవ్వకాలు జరిపిన ఆనవాళ్లతో గత నెలలో ఫిర్యాదు చేశారు. దళితులే కాకుండా మరి కొంత మంది మిలటరీలో పనిచేసిన వ్యక్తులకు కూడా అక్కడ భూములు కేటాయించడం జరిగింది. బాధి తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం పిడుగురాళ్ల తహసీల్దార్ మధుబాబు, సర్వేయరు వెంకటేశ్వర్లు, ఇతర రెవెన్యూ అధికారులు దళితులకు కేటాయించిన భూముల్లో జరిపిన తవ్వకాలను పరిశీలించారు. పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

విలీన వెతలు!

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఈ నేపథ్యంలో పంచాయతీకి చెల్లించిన పన్ను కంటే కొన్ని చోట్ల 10 నుంచి 20 రెట్లు పన్ను పెరిగే అవకాశం ఉంది. మార్కెట్ విలువ ప్రకారం కాకుండా పంచాయతీకి చెల్లిస్తున్న పన్నుపై ఏటా 15 శాతం పెంచి వసూలుకు అనుమతి ఇవ్వాలని మునిసిపల్ డీఎంఏకు పురపాలక సంఘం పలుమార్లు లేఖలు రాసినా స్పందన లేదు. అసెస్మెంట్ నంబర్ నమోదు చేయగానే ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా పన్ను వస్తుంది. ప్రభుత్వం అనుమతి ఇస్తే ఆన్‌లైన్ విధానంలో అసెస్మెంట్ నమోదు చేసి.. పాత పన్నుపై 15 శాతం మాత్రమే పెంచేందుకు అవకాశం ఉంటుంది. అప్పటి వరకు పన్ను వసూలు చేసే పసిస్థితి లేదని సదరు అధికారులు తెలిపారు. పంచాయతీలు మునిసిపాలిటీకి అప్పగించిన రికార్డుల ప్రకారం విలీన ప్రాంతాల నుంచి ప్రతి ఆరు నెలలకు రూ.60 లక్షల పన్ను వసూలు చేయాల్సి ఉంది. కొత్తగా ఇళ్లను నిర్మించుకునే వారికి మున్సిపాలిటీ ప్లాన్ మంజూరు చేస్తోంది. కొత్త ఇంటికి రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం పన్ను విధిస్తున్నారు. విలీనానికి ముందు నిర్మించిన గృహాలకు ఇప్పట్లో పన్ను వసూలు చేసే పరిస్థితి లేదని చెప్పవచ్చు.

రాజధాని రైతులకు.. 'రిటర్న్' గిఫ్ట్!

(5వ పేజీ తరువాయి)

ఇచ్చింది. అయితే ఆ ప్లాట్లపై రుణాలిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రాలేదు. నియమాలు, సాంకేతిక కారణాలు చూపుతూ ముఖం చాటేశారు. గత అయిదేళ్ల పాలనలో కౌలు రాకపోవడంతో పాటు.. ప్రభుత్వ వేధింపులు తాళలేక చిన్న, సన్నకారు రైతులు అనేకమంది అప్పులపాలయ్యారు. రాజధాని కోసం భూములిచ్చిన వారిలో ఎకరాలోపు ఉన్న చిన్నకారు రైతులు 20,490 మంది, ఒకటి నుంచి రెండెకరాలలోపు ఉన్న సన్నకారు రైతులు 5 వేల మంది ఉన్నారు. పోయిన ఆరేళ్లలో వారంతా బ్యాంకు రుణాల కోసం చేయని ప్రయత్నం లేదు. కానీ, బ్యాంకర్లు ససేమిరా అన్నారు. దీనికి తోడు భూములు ప్రభుత్వానికి ఇవ్వడంతో వాటిపై సహకార రుణాలు పొందే అవకాశం లేకుండాపోయింది. దీంతో రైతులు నరకం అనుభవించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వారి 'రుణ' కష్టాలు కొనసాగాయి. ఈ విషయం సీఎం దృష్టికి కూడా వెళ్లింది. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

● ముందుకొచ్చిన లీడ్ బ్యాంకు

రిటర్నబుల్ ప్లాట్లపై రుణాలివ్వాలని లీడ్ బ్యాంకు అయిన యూనియన్ బ్యాంకు తాజాగా జిల్లాలోని అన్ని బ్రాంచ్‌ల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రుణ మంజూరుకు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే బ్యాంకులు ఆమోదం తెలిపాయి. ఫిబ్రవరిలో జరిగిన ఎస్ఎల్‌బీసీలో రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారు. కానీ రుణాలివ్వడానికి ముందుకు రాలేదు. నెలన్నర క్రితం ఉండవల్లిలో సీఎం నిర్వహించిన సమావేశంలో రైతులు తమ గోడు విని పించారు. తాజాగా జూలై 25న సబ్ కమిటీ సమావేశంలో ప్లాట్లపై రుణాలు ఇ వ్వాలని తీర్మానించారు. ఈ తీర్మానం ఆధారంగా లీడ్ బ్యాంకు ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాల మేరకు బ్యాంకర్లు ముందుకు రావాలని రైతులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తగా ఉండాలి

నరసరావుపేట లీగల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులపై డీజీపీ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు ఎస్పీ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు డ్రంక్ అండ్ డ్రైవ్, 11 నుంచి 17వ తేదీ వరకు ఓవర్ స్పీడ్, 18 నుంచి 24వ తేదీ వరకు హెల్మెట్ ధారణ, 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అన్ని రకాల ఉల్లంఘనలపై బ్లాక్ స్పాట్లలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించింది.

10న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

గుంటూరు(తూర్పు), ఆగ స్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ర్యాకింగ్ చదరంగం పోటీలు ఈ నెల 10న లాం ఢిల్లీ పబ్లిక్ స్కూ ల్లో నిర్వహిస్తున్నట్లు టోర్న మెంట్ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-6, 8, 10, 12, 14, 16 బాల బాలికల విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కల్గిన క్రీడాకారులు ఈ నెల 8లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలి పారు. మొదటి పది స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 90631 42105 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

రేపటి నుంచి మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ వేళల్లో మార్పు

గుంటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నిత్యం మాచర్ల - విజయవాడ మధ్యన ప్రయాణించే 67228 ప్యాసింజర్ రైలు వేళల్లో రైల్వే శాఖ మార్పు చేసినట్లు డీఆర్ఎం సుధేష్ణ సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఈ రైలు మాచర్లలో ఉదయం 5.30కి బయలుదేరుతుండగా ఈ నెల 6వ తేదీ నుంచి ఉదయం 6కు ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. ఆ తర్వాత 6.20కి రెంటచింతల, 6.32కి గురజాల, 6.48కి నడికుడి, 7.02కి తుమ్మలచెరువు, 7.13కి పిడుగురాళ్ల, 7.20కి బెల్లంకొండ, 7.27కి రెడ్డిగూడెం, 7.39కి సత్తెనపల్లి, 7.52కి పెదకూరపాడు, 8 గంటలకు సిరిపురం, 8.08కి బండారుపల్లి, 8.18కి నల్లపాడు, 8.30కి గుంటూరు, 8.39కి పెదకాకాని, 8.52కి నంబూరు, 9.34కి మంగళగిరి, 9.54కి కృష్ణాకెనాల్, 10.55కి విజయవాడ చేరుకొంటుందన్నారు. ఈ మార్పుని ప్రయాణికులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. మాచర్ల - గుంటూరు మధ్యన ఈ రైలు వేగాన్ని పెంచినట్లు తెలిపారు.

నేడు మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు (విద్య) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడులోని మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాజశేఖర్ రావు సోమవారం ఒక ప్రకటన తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పదవ తరగతి మార్కులు జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారుల బృందం

డ్రాప్ అవుట్‌ల సంఖ్య తగ్గించాలి

పిడుగురాళ్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్‌ల సంఖ్య తగ్గించాలని జిల్లా విద్యాశాఖ అధికారుల బృందం పద్మారావు, శంకరరాజులు సూచించారు. సోమవారం స్థానిక జడ్పీ పాఠశాలను సందర్శించి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్‌ల పంపిణీ వివరాలు తెలుసుకోవడంతో పాటు డ్రాప్ అవుట్‌ల సంఖ్యను తెలుసుకొని ప్రతి పాఠశాలలో హాజరుశాతం పెంచాలని సూచించారు. అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ బాలుర పాఠశాలను సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం కొత్త మల్లికార్జునరావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మధుబాబు, ఏఓ సంధ్యారాణి తదితరులు

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పిడుగురాళ్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర ఎరువుల దుకాణంలో సోమవారం తహసీల్దార్ మధుబాబు, ఏఓ సంధ్యారాణిలు తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌లు, బిల్ బుక్స్, ఫిజికల్ స్టాక్‌ను పరిశీలించడంతో పాటురైతులు కొనుగోలు చేసిన ప్రతి ఎరువులు, పురుగుమందులకు బిల్లులు అందజేయాలని తహసీల్దార్, ఏఓలు సూచించారు. అధిక ధరలకు విక్రయించొద్దని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ ఎన్నిక

పిడుగురాళ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ ఎన్నికలు సోమవారం స్థానిక మిలటరీ కాలనీలోని పాఠశాలలో జరిగాయి. మండల అధ్యక్షుడిగా జడ ఆల్ఫ్రెడ్, ప్రధాన కార్యదర్శిగా అంగడి అశోక్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా మూడావత్ దిలీప్‌నాయక్, ఉపాధ్యక్షులుగా తాళ్లూరి శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శిగా పేరం సాంబశివరావు, గౌరవ అధ్యక్షులుగా దేవరకొండ నాగేశ్వరరావు, కార్యదర్శిగా చొక్కా ఆనంద్‌సాగర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రామావత్ రక్కునాయక్, రాగిడి కోటేశ్వరరావు, కారసాల విజయబాబు, పులి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీ వర్కర్స్ వాడుతున్న సెల్‌ఫోన్‌లను సోమవారం ఐసీడీఎస్ అధికారులకు అందజేశారు. పనిచేయని ఫోన్లతో వివరాలు నమోదుచేయడం ఇబ్బందిగా వుందని, 5జి సిమ్‌తోపాటు ట్యాబ్‌లను అందజేయాలని అంగన్‌వాడీలు అధికారులను కోరారు. గత నాలుగేళ్ల క్రితం 2జి ఫోన్లు ఇవ్వడం వల్ల సర్వర్ సమస్య ఏర్పడి ఫోన్లు పనిచేయకపోవడం జరుగుతుందని, అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపాలి

దాచేపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యాన సోమవారం పిల్లలను, తల్లిదండ్రులను కలిసి వారికి చదువుపై అవగాహన కల్పించారు. సోమవారం ఏఎస్‌వో పద్మారావు, ఏపీవో రాజు, ఏఎల్ఎస్‌సీ శ్రీనివాసరావు, ఎంఈవో పినాకపాణి తదితరులు విద్యార్థులకు పంపిణీ చేసిన మూల్యాంకన పుస్తకాలు పరిశీలించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర స్టూడెంట్స్ కిట్స్‌ను పరిశీలించారు. తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు క్రమం తప్పకుండా పంపాలన్నారు.

పిల్లలకు తల్లిపాలు శ్రేష్టం

దాచేపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు పిల్లలకు శ్రేష్టమని, తల్లులు పిల్లలకు తప్పనిసరిగా పాలు ఇవ్వాలని బాలింతలకు తెలిపారు. సోమవారం దాచేపల్లి నగర పంచాయతీ ఇందిరానగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గర్భిణీలు, బాలింతలు హాజరయ్యారు. సూపర్‌వైజర్ శ్రీలత మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం ద్వారా పుట్టిన బిడ్డతోపాటు తల్లికి కూడా అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● దుర్గి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు ముద్దు.. డబ్బా పాలు వద్దు అని దుర్గి పీహెచ్‌సీ సూపర్ వైజర్ పీఏఎల్ నారాయణమ్మ అన్నారు. సోమవారం జంగాల కాలనీలోని భీమాలీలా అంగన్‌వాడీ వర్కర్ సెంటర్లో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భీమాలీలా, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశా వర్కర్లు మాచర్ల మేరి, విజయశ్రీ, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

నేడు పెదమద్దూరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పెదమద్దూరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం మంగళవారం ఉదయం జరుగుతుందని సంఘ సీఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు. కమిటీ ఛైర్‌పర్సన్‌గా భావన సూర్యనారాయణ, పర్సన్స్‌గా పొదిలె సాంబశివరావు, సిద్దె శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

రైతుల పొలాలకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గురజాలటౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడుగుల సబ్‌స్టేషన్‌లోని రైతుల పొలాలకు విద్యుత్ సరఫరా మంగళవారం నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రసాద్ తెలిపారు. మాడుగుల సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ మాడుగుల అగ్రికల్చర్ ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు. ఉదయ 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. రైతులు సహకరించాలని కోరారు.

● మాచర్లటౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూనగర్, శివప్రియనగర్ ప్రాంతాల్లో ఉదయ 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. ఫీడర్‌లో రెక్టిఫికేషన్ నిమిత్తం సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

● కారంపూడి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కారంపూడి సబ్‌స్టేషన్ పరిధి లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించనున్నట్లు ఏఈ గొల్లపల్లి వీరాంజనేయులు తెలిపారు. 11కేవీ మేళ్లవాగు ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు నడుపుతూ విద్య విధానాన్ని ముందుకు తీసుకుపోతున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. సోమవారం మండలంలోని రాజుపాలెం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో రూ.కోటి 59లక్షల 50వేలతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ మంత్రి లోకేశ్ నాయకత్వంలో విద్యావిధానం సమగ్రంగా ప్రక్షాళన చేస్తున్నారన్నారు. అరాచక ప్రభుత్వాన్ని పారదోలి ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన చేసే ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకున్నామన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అంచుల నరసింహరావు, పల్లపాటి పెద్దిరాజు, మొరసా శ్రీనివాసరావు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నల్లమోతుల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు పులిబండ్ల అశోక్, పసుపులేటి వెంకటస్వామి, కణదం శ్రీను, కుందూరు పేతురు, తోట శ్రీను, నిమ్మకాయల షేక్ అల్లాబక్షు, అంకాళ్ల ప్రభుదాసు, శనగపూల నరసింహరావు, పులిబండ్ల సాంబశివరావు, జెట్టి కోటేశ్వరరావు, వాసా వెంకటేశ్వర్లు ఉన్నారు.



రాజుపాలెం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

బాలికలు విద్యావంతులు కావాలి

సత్తెనపల్లి ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలలో చదువుతున్న బాలికలు ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని విద్యాపరంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని కేజీబీవీలో సోమవారం రూ.3కోట్ల 87లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిధులతో కేజీబీవీలో బాలికలకు అదనపు వసతి గృహం, కంప్యూటర్ రూం, ఆర్ట్‌అండ్‌క్రాఫ్ట్ రూం, లైబ్రరీ నిర్మాణపనులు చేస్తామన్నారు. రాజుపాలెం కేజీబీవీలో కూడా బాలికల అదనపు వసతిగృహం నిర్మిస్తామన్నారు. ప్రభుత్వం కేజీబీవీల అభివృద్ధికి బాలికల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. తరగతి గదిలో బాలికలతో మాట్లాడారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

మాచర్ల రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన ఆర్యవైశ్య విద్యార్థులకు త్వరలో జరగబోయే కార్యక్రమంలో నగదు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ఆర్యవైశ్య విద్యానిధి(ఆవోపా) అధ్యక్షుడు జేవీకేఎస్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మాచర్ల పట్టణంలో చదివిన ఆర్యవైశ్య విద్యార్థులు 10వ తరగతి, ఇంటర్, ఎంసెట్‌లో ప్రతిభచూపినవారు సెల్: 9491218777కు మార్క్‌లిస్టులు, ఫోన్ నంబరు, ఇతర వివరాలు పంపి సంప్రదించాలని కోరారు. కమిటీ నిర్ణయం మేరకు దాతల సహకారంతో నగదు ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. ఆర్యవైశ్య విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

మాచర్ల రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాయ్స్, గర్ల్స్, మండలంలోని కంభంపాడు జడ్పీహెచ్ పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె గంగాధరబాబు, మాచర్ల ఏరియా కార్యదర్శి టీ రాజశేఖర్, జిల్లా మైనార్టీ కన్వీనర్ అబ్దుల్ జబ్బార్, ఎక్స్‌మాస్ జాన్, బీ నాగరాజు, అబ్దుల్ రహిమాన్, బాలునాయక్, డేవిడ్ రాజు, మధుసూదనరావు, భాస్కరబాబు, డేవిడ్ విల్సన్, సిలార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కౌన్సిలర్‌గా శ్రీనివాసరెడ్డి

పెదకూరపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘ రాష్ట్ర కౌన్సిలర్‌గా పెదకూరపాడు మండలం 75త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ అన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లోని తిలక్ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన పల్నాడు జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ సమావేశంలో శ్రీనివాసరెడ్డిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను బి.చంద్రకుమారి, బి.శివరామయ్య, హెచ్.ఎం కె.వెంకటేశ్వర్లు, టి.చంద్రయ్య తదితరులు అభినందించారు.

స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలి

● సీపీఎం నేత బండ్ల మహేష్

మాచర్లటౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అదానీ ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను గృహాలకు బిగించకుండా ప్రజలు తిరస్కరించాలని సీపీఎం జిల్లా నేత బండ్ల మహేష్ అన్నారు. అదానీ స్మార్ట్‌మీటర్లు వద్దు, పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ అదానీకి లాభాలు చేకూర్చాలని ప్రభుత్వం యోచిస్తోందని, ప్రజలు దీన్ని వ్యతిరేకించాలని కోరారు.

చివరి భూములకూ నీరందించడమే ప్రభుత్వ ధ్యేయం

మాచవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో చిట్టచివరి భూముల వరకు నీరందించడమే ధ్యేయమని నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ రైతు సంఘం ఉపాధ్యక్షుడు దున్నా చెన్నయ్యచౌదరి అన్నారు. సోమవారం ఆకురాజుపల్లి మేజర్ పరిధిలోని మోర్జంపాడులో కాలువల మరమ్మతులకు శంకుస్థాపన చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యామని రాంబాబు, పాపయ్య, ఇన్‌చార్జి డీఈ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక నిర్మాణానికి భూమిపూజ

కారంపూడి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్లలో రూ.15లక్షలతో హిందూ శ్మశానవాటిక నిర్మాణానికి సోమవారం సర్పంచ్ పుష్పలత భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

గురజాల సీడీపీవోగా అపరంజి జ్యోత్స్న

గురజాలటౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గురజాల ఐసీడీఎస్ నూతన సీడీపీవోగా బి అపరంజి జ్యోత్స్న సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఏలూరు జిల్లా ఆర్జేడీ కార్యాలయంలో ఈవోగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై గురజాల ప్రాజెక్ట్ సీడీపీవోగా వచ్చారు.

దాచేపల్లిలో ప్రారంభం కానున్న పోస్టల్ కార్యాలయం



దాచేపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి వాసులు గత 20 యేళ్లుగా గ్రామంలో పోస్టాఫీసు కార్యాలయం ఏర్పాటు చేయాలని చేస్తున్న డిమాండ్ నెరవేరనుంది. పోస్టల్ శాఖ ఆధ్వర్యాన కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 40 లక్షలకు పైగా నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో భవన నిర్మాణం పూర్తి చేశారు. ఈ భవనాన్ని త్వరలో ప్రారంభించేందుకు పోస్టల్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

మాధవ్ పర్యటనకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

క్రోసూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నరసరావుపేటలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటనలో పాల్గొనేందుకు సోమవారం క్రోసూరు నుంచి ఆ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో వెళ్లారు. పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, కామేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో కార్లు, జీపులు, ద్విచక్రవాహనాలపై పార్టీ కార్యకర్తలు నరసరావుపేటకు వెళ్లారు. ఈ సందర్భంగా క్రోసూరులో ర్యాలీ నిర్వహించారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

● ఎంపీడీవో గౌసియాబేగం



పీఎస్‌లకు సూచనలిస్తున్న ఎంపీడీవో గౌసియాబేగం

గురజాలటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శానిటేషన్‌పై దృష్టి పెట్టాలని గురజాల ఎంపీడీవో గౌసియాబేగం అన్నారు. సోమవారం తన కార్యాలయంలో మండలంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రజలకు అవాహన కల్పించాలన్నారు. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

విజయపురిసౌత్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని స్థానిక ఏపీఆర్ డీసీ ప్రిన్సిపాల్ నయామ్‌భాను అన్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన దీక్షారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఈ కళాశాలలో ప్రవేశించడం గొప్ప అవకాశంగా భావించాలని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ విజయకుమార్, డిప్యూటీ వార్డెన్ సతీష్, సీనియర్ అధ్యాపకుడు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నయామ్‌భాను

నరుకుళ్లపాడు పీఏసీఎస్‌కు ఉత్తమ పురస్కారం



మంత్రి అచ్చెన్నాయుడు నుంచి పురస్కారం అందుకుంటున్న జగదీష్, సీఈఓ వెంకటేశ్వరరావు

అమరావతి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని నరుకుళ్లపాడు పీఏసీఎస్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ 2023-24 సంవత్సరానికిగాను ఉత్తమ పురస్కారం అందజేసింది. నరుకుళ్లపాడు పీఏసీఎస్ పరిధిలో రైతులకు అందించిన రుణాలు, రికవరీ, సంఘ ఆర్థికాభివృద్ధికి సంబంధించి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. పురస్కారాన్ని సోమవారం విజయవాడలో జరిగిన పురస్కార ప్రదాన వేడుకలలో రాష్ట్ర సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పురస్కారాన్ని అందజేశారు. సంఘ ఛైర్‌పర్సన్ భాష్యం జగదీష్, సీఈఓ వెంకటేశ్వరరావులు ఈ పురస్కారాన్ని మంత్రి చేతులమీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మునగోడు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ నాగోతు నాగార్జున పాల్గొన్నారు. జగదీష్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు.

ప్రజల దాహార్తిని తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ సీనియర్ నేత వీరాంజనేయులు

మాచర్లటౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ సీనియర్ నేత తోట వీరాంజనేయులు అన్నారు. సోమవారం వెల్దుర్తి ఎస్సీకాలనీలో తాగునీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు నూతన నీటి మోటారును వీరాంజనేయులు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల అమ్మకాలు నిలిపివేత



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారుల బృందం

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి అధికారుల బృందం సోమవారం మండలంలోని పలు గ్రామాలలో ఉన్న ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా దుకాణాలలో ఫాం-ఓ పత్రాలు లేని రూ.2.70లక్షల విలువైన 10 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు ఏవో బి.సుబ్బారెడ్డి తెలిపారు. ఎమ్మార్పీ ధరకే ఎరువులు కొనుగోలు చేయాలని ఆయన రైతులకు సూచించారు. అధికారుల బృందంలో తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

ఎరువులు, పురుగుమందుల షాపులలో తనిఖీలు

క్రోసూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల షాపులలో సోమవారం రెవెన్యూ, వ్యవసాయ అధికారులు విస్తృతంగా తనిఖీలు జరిపారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలు, గిడ్డంగులలోని ఎరువుల నిల్వలను, స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. ధరల పట్టిక, లైసెన్సు ప్రదర్శన తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు అధికృత డీలర్ల వద్దనే ఎరువులు, పురుగుమందులను కొనుగోలు చేసి బిల్లు పొందాలన్నారు. అనధికారికంగా విక్రయించినా, తూకాలలో తేడాలో ఉన్నా సహించేది లేదన్నారు. తనిఖీలలో తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు, ఏవో వీ వేణుగోపాల్, వీఆర్వో బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు రైతుల పక్షపాతి

● నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్

పెదకూరపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. ఎన్నికల హామీ మేరకు కేంద్రం సహకారంతో రూ.7వేలు తొలివిడతగా రైతుల ఖాతాల్లో జమ చేయడం హర్షణీయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని, రైతు ఆత్మహత్యల్లో మన రాష్ట్రం దేశంలోనే 3వ స్థానంలో, కౌలు రైతు ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఉండటం రైతుల పట్ల జగన్‌రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి తెలుస్తుందన్నారు. చంద్రబాబుకు రైతుల కష్టాలు తెలుసని అన్నారు. రైతు గెలవాలి వ్యవసాయం నిలవాలనేది చంద్రబాబు సంకల్పమన్నారు.



ఆవులవారిపాలెం గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

సంవత్సరంలో గణనీయ అభివృద్ధి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) గడచిన సంవత్సర కాలంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం మండలాల్లోని ఆవులవారిపాలెంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన అభివృద్ధిని సమీక్షించారు. అంతర్గత రహదారులు, సైడ్ కాలవలు మంచినీటి సౌకర్యం మొదలైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధికి రూ.వంద కోట్ల ను ఖర్చు చేశామని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల దోపిడీలు, దౌర్జన్యాలు నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్నారన్నారు. టీడీపీ నాయకులు తోక వెంకట్రావు, నల్లజాల కోటేశ్వరరావు, ఏఘరి నాగేశ్వరరావు, దుద్దుల యోహాను, నర్రా వెంకటప్పయ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ దేవాలయ ప్రతిష్ఠ

మండలంలోని ఆవులవారిపాలెం గ్రామంలో సోమవారం నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ దేవాలయాన్ని నిర్మించారు. గ్రామంలో పిడుగుపాటుకు దెబ్బతిన్న రామాలయ శిఖర ప్రతిష్ఠలో కూడా ఎమ్మెల్యే పాల్గొన్నారు. దేవాలయంలో జరిగిన శాంతి కల్యాణంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సర్పంచ్ తిరుమల శీను, యాదవ సంఘం నాయకులు పిల్ల నరసయ్య, అల్లరి సుధాకర్ తదితరులు పర్యవేక్షించారు.



బండ్ల హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

● బండ్ల హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలోని పేదలకు ప్రైవేటు వైద్యశాలల్లో కూడా మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పిడుగురాళ్లలోని వున్నం కాంప్లెక్స్‌లో బండ్ల హాస్పిటల్‌ను ఎమ్మెల్యే యరపతినేని ప్రారంభించారు. తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్యాన్ని అందించే విధంగా ప్రైవేటు వైద్యశాలలు పనిచేయాలని సూచించారు. ఓపి విభాగాన్ని టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి ప్రారంభించారు. సీనియర్ వైద్యులు ఓగూరి కోటయ్య, కెవి సుబ్బారావు, వున్నం నాగమల్లికార్జునరావు, లక్ష్మణరావు, ఐఎంఏ అధ్యక్షుడు దూళిపాళ్ల భరత్‌కుమార్, గార్లపాటి కృష్ణకాంత్, తదితరులు పలు విభాగాలను ప్రారంభించారు. హాస్పిటల్ వైద్యులు బండ్ల మణిదీప్, వైష్ణవి, బండ్ల నాగేశ్వరరావు దంపతులు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును, ముఖ్యఅతిధులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కొత్త వెంకటసుబ్బారావు, పాండురంగ శ్రీను, తురకా వీరస్వామి, వున్నం వెంకట్రావు, పిల్లి చెన్నారావు, అమీర్‌అలీ, వున్నం సురేష్, వడ్డవల్లి సాంబశివరావు, ముప్పాళ్ల సాంబయ్య, వడ్డవల్లి వెంకటేశ్వర్లు, జూలకంటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



తరువుతీరా.. చిగురించు!

స్థానిక స్వామి థియేటర్ సమీపంలో ఓ చెట్టు పూర్తిగా ఎండిపోవడంతో పైకొమ్మల వరకు నరికి వేశారు. అయితే తిరిగి దానికి పునరుజ్జీవం పోసి చిగురింప చేయడానికి స్థానికులు ప్రయత్నిస్తున్నారు. చెట్టు మొత్తం గోతాలు చుట్టి ఇలా సంరక్షిస్తున్నారు. మోడు వారిన ఈ చెట్టు కొత్త చిగుళ్లతో కళకళలాడుతుందో లేదో వేచి చూడాలి మరి.

- గుంటూరు (ఆంధ్ర జ్యోతి)

త్రికరణ శుద్ధిగా.. హర్ ఘర్ తిరంగా



● మూడు దశల్లో కార్యక్రమాల నిర్వహణ
● ప్రతీ ఇంటిపై జాతీయ జెండా రెపరెపలు..
● ర్యాలీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మానవ హారాలు
● జిల్లా స్థాయిలో ఒక భారీ కార్యక్రమానికి ఆదేశాలు

గుంటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మూడేళ్లుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తోన్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఈ నెల 8వ తేదీ వరకు తొలి దశ, 9 నుంచి 12వ తేదీ వరకు రెండో దశ, 13 నుంచి 15వ తేదీ వరకు మూడో దశ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించింది. జిల్లాకు నోడల్ ఆఫీసర్‌గా సెప్ సీఈవో చంద్రమునిని నియమించారు. జెండా ఆవిష్కరణలు, తిరంగా ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించాలని ఆదేశించింది. విద్యా సంస్థలు, స్వయం సహాయక బృందాలు, యూత్ క్లబ్‌లు, స్థానిక సంస్థలను సమీకరించాలని సూచించింది. సెల్ఫీ విత్ తిరంగా కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని.. ఇందుకోసం హర్‌ఘర్‌తిరంగా.కామ్ వెబ్‌సైట్ గురించి వివరించాలని ప్రభుత్వం పేర్కొంది.

మూడు దశల్లో..

- తొలి దశ హర్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల గోడలు, బోర్డులపై తిరంగా స్ఫూర్తిని నింపే చిత్రాలతో అలంకరించాలి. కేంద్ర సాంస్కృతిక శాఖ పంపిన ఫొటోలతో ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసి నాటి స్వాతంత్ర్య పోరాట దృశ్యాలను కళ్ల ముందుంచాలి. తిరంగా రంగోలి పోటీలు పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించాలి. తిరంగా రాఖీలను తయారు చేసి సైనికులు, పోలీసులకు పంపేలా పోస్టల్ శాఖతో సమన్వయం చేసుకోవాలి. బహిరంగ ప్రదేశాలు, మార్కెట్‌ల వద్ద తిరంగాని ప్రతిబింబిస్తూ కార్యకలాపాలు నిర్వహించాలి.
- రెండో దశ ప్రారంభమయ్యే ఈ నెల 9 నుంచి 12వ తేదీ మధ్యన భారీ స్థాయిలో తిరంగా మహోత్సవ్‌ని నిర్వహించాలి. ఈ కార్యక్రమానికి తప్పక స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, క్రీడాకారులు, పతాక గ్రహీతలు హాజరయ్యేలా చూడాలి. సెల్ఫీ బూత్‌లను ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలి. సాంస్కృతిక ప్రదర్శనలతో తిరంగా కార్యక్రమాలను నిర్వహించాలి. తిరంగా బైక్, సైకిల్ ర్యాలీలు నిర్వహించాలి. తిరంగా లైటింగ్‌లు మార్కెట్‌ల వద్ద ఏర్పాటు చేయాలి. ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా చూడాలి.
- మూడో దశ ఈ నెల 13 నుంచి 15వ తేదీల మధ్యన జెండా ఆవిష్కరణలు, ప్రభుత్వ, విద్యా సంస్థలు, హోటల్స్, డ్యాంలు, బ్రిడ్జీలకు తిరంగా లైటింగ్ ఏర్పాటు చేయాలి. రైల్వేస్టేషన్లు, స్కూల్స్, బహిరంగ ప్రదేశాలు వద్ద ఎగ్జిబిషన్‌లు నిర్వహించాలి. క్విజ్ పోటీలను పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించాలి. స్వచ్ఛత, సుజలత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. రికార్డు స్థాయిలో మానవహారాలు కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు.

నిత్య ప్రయాణం.. తప్పని ప్రమాదం!

● అధ్వానంగా అంగలకుదురు - యడ్లపల్లి రోడ్డు
● ఆరేళ్లుగా అభివృద్ధికి నోచుకోని వైనం
● గుంతల మయంగా మారి, కుంగిపోయి..
● నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు



అధ్వానంగా ఉన్న అంగలకుదురు - యడ్లపల్లి రోడ్డుపై వెళుతున్న వాహనాలు



కోసుకుపోయి ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

తెనాలి రూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డుపై ప్రయాణమంటే వాహనదారుల్లో వణుకుపుడుతోంది. గత టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన తారు రోడ్డు కాస్త రూపురేఖలు మారి అధ్వానంగా తయారై.. డేంజర్ బెల్ మోగిస్తోంది. తెనాలి మండలం అంగలకుదురు నుంచి చుండూరు మండలం యడ్లపల్లి వెళ్లే రోడ్డ దుస్థితి ఇది. ఐదేళ్ల వైసీపీ పాలనలో సంక్షేమం, అభివృద్ధి అని ప్రచారం మినహా మూడు కిలోమీటర్ల రోడ్డుకు తట్టెడు మట్టి వేసి.. గుంతలు కూడా పూడ్చలేకపోయారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ రోడ్డుకు మోక్షం లభించకపోదా అని వాహనదారులు ఎదురుచూస్తున్నారు. నిత్యం వేలాది మంది గ్రామీణ ప్రాంత ప్రయాణికులు.. ఏదో ఒక అవసరంపై ఆ మార్గంలో అంగలుకుదురు కూడలికి చేరి అక్కడి నుంచి గుంటూరు, తెనాలి ప్రధాన రహదారిగా ప్రయాణం చేస్తుంటారు.

అందరికీ ఇదే మార్గం..

చిన్నపాటి అనారోగ సమస్యలు తలెత్తినా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు సైతం ఇదే రోడ్డులో రాకపోకలు సాగించాల్సి ఉంది. యడ్లపాడు నుంచచి తెనాలికి కేవలం 6 కిలోమీటర్లు మాత్రమే ఉండటంతో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు, వివిధ ఉద్యోగులు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగు మందులు వంటివి కొనుగోలు చేసేందుకు కూడా ఇదే మార్గంగా రాకపోకలు చేయాల్సి ఉంది. పంట ఉత్పత్తులను వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించేందుకు ఇదే మార్గం.

ప్రమాదాలకు నెలవు..

ఈ రోడ్డులో కొంత దూరం చిప్స్ తేలిపోయి.. వాహనం టైర్లు జారిపోయే పరిస్థితి ఉంది. ఈ రోడ్డుకు ఇరు వైపులా.. పంట కాల్వలు ఉన్నాయి. ముందు వాహనం వెళితే వెనక వాహనదారులు ప్రయాణం చేయలేని పరిస్థితి. ప్రధానంగా దుమ్ము లేచి గాలిలో కలిసిపోయి.. వాహనదారులు ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి నెలకొంది. రోడ్డు అధ్వానంగా ఉండడంతో.. ఆటోలు త్వరగా మరమ్మతులకు గురవుతున్నాయని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రులు ఇదే రోడ్డు మార్గంలో ప్రయాణించే పలు వాహనదారులు గుంతలను తప్పించబోయి.. అదుపుతప్పి ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులుగా మారారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి రోడ్డు ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారుతుంది. గర్భిణులు, వృద్ధులు వంటి వారిని వైద్యశాలలకు తీసుకు వెళ్లే క్రమంలో 108 వంటి వాహనాలు కుదుపులకు గురై.. ఇబ్బందులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వమైన ఈ రోడ్డు దుస్థితిపై దృష్టిపెట్టి సత్వరమే నూతన రోడ్డు పనులు ప్రారంభించి ప్రయాణం సురక్షితంగా జరిగేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జీవనాడికి జవసత్వాలు



కృష్ణమ్మకు పూజలు నిర్వహిస్తున్న రైతులు

● వరికపూడిశెల కల సాకారం చేసిన సీఎంకు రుణపడి ఉంటాం
● రైతు బాంధవులు బ్రహ్మానందరెడ్డి, లావుకు కృతజ్ఞతలు
● ప్రాజెక్ట్ వద్ద జలసాధన సమితి సభ్యుల క్షీరాభిషేకం

మాచర్లటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రజల జీవనాడి, ఏడు దశాబ్దాల చిరకాల వాంఛ వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు అడుగులు పడుతున్న వేళ కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రుణపడి ఉటామని వరికపూడిశెల జలసాధన సమితి సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం నల్లమల అటవీ ప్రాంతంలోని వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మించ తలపెట్టిన దమ్మర్లగొంది వద్ద కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సారె సమర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలి అని, ప్రాజెక్ట్ కల సాకారం చేసినందుకు ధన్యవాదాలు చెబుతూ నినాదాలు చేశారు.

స్టంట్‌లు కాదు..ఏడాదిలోనే సాధించారు

గత పాలకులు ఇదిగో.. అదిగో వరికపూడిశెల అంటూ బూటకపు భూమి పూజలతో ఎన్నికల స్టంట్స్ చేశారని రైతులు ఈ ఒసదర్భంగా విమర్శించారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి అడ్డంకిగా మారిన అటవీ శాఖ అనుమతులకు కావాల్సిన కనీస నిధులు కూడా విడుదల చేయకుండా చేతులెత్తేసి మోసం చేశారని గత వైసీపీ పాలన విధానాలను దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రాజెక్ట్ ప్రాధాన్యతను పదే పదే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి.. నిధులు సాధించారని సంతోషం వ్యక్తం చేశారు.

రైతు బాంధవులు జూలకంటి, లావు

పల్నాడు ప్రాంత రైతు బాంధవులు ఎమ్మెల్యే జూలకంటి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అని రైతులు కొనియాడారు. ఈ ప్రాంత బిడ్డగా, రైతుగా స్థానిక ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రాజెక్ట్ నిర్మాణ ఆవశ్యకతను పదే పదే చట్ట సభల్లో ప్రస్తావించడం, ప్రాజెక్ట్ నిర్మించి తీరకుంటే రాజకీయాలు నుంచి తప్పుకుంటానని భీష్మించారని గుర్తుచేశారు. అలాగే ఈ ప్రాంత రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు గుర్తించి ఢిల్లీ నుంచి ప్రాజెక్ట్ అనుమతులు తీసుకురావడంలో ఎంపీ లావు చేసిన కృషిని రైతులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బొల్లాపల్లి, పుల్లల చెరువు, వెల్దుర్తి మండల రైతులు పాల్గొన్నారు.

త్వరలో విస్తృత స్థాయిలో ఉద్యోగోన్నతులు



ఎంపీడీవోలకు సూచనలు చేస్తున్న డిప్యూటీ సీఎం వోఎస్డీ కె.వెంకటకృష్ణ

● డిప్యూటీ సీఎం ఓఎస్డీ కె.వెంకటకృష్ణ
● ఉద్యోగోన్నతులు పొందిన ఎంపీడీఓలకు శిక్షణ

బాపట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం పరిధిలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రమోషన్ పొందిన ఎంపీడీఓలకు నెల రోజుల శిక్షణకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం వోఎస్డీ కె.వెంకటకృష్ణ పాల్గొన్నారు. శిక్షణకు సంబంధించిన విషయాలను క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమ్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత ప్రజాహితంగా మార్చేందుకు ఉప ముఖ్యంత్రి అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో 10వేల మందికి పైగా ఉద్యోగోన్నోతులు కల్పించామని, అతి త్వరలో మరి కొంతమందికి విస్తృత స్థాయిలో పదోన్నతులు కల్పించబోతున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ సంస్థలను ఆర్థిక స్వాలంబన సాధించడానికి ఆదాయ వనరులను పెంపొందించుకొని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను, వివిధ శాఖలను సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా చేపట్టటానికి అధికారులు చొరవ చూపాలని నిర్దేశించారు. ఈ శిక్షణలను సద్వినియోగం చేసుకొని స్థానిక పరిపాలన తీరులో మార్పు చేకూరాలని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పెదకాపవరం గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాలకు సంబంధించిన డాక్యుమెంటరీ ప్రదర్శించారు. వివిధ శాఖల సమన్వయంతో గ్రామ ప్రజల భాగస్వామ్యంతో ఆపాఠశాలను కార్పోరేట్ పాఠశాల కన్న మిన్నగా తాను స్వయంగా ఏ విధంగా తీర్చిదిద్దిన వైనాన్ని సోదాహరణంగా వివరించారు. అదే స్ఫూర్తితో మండలాధికారులు మండలంలోని ఏదైన ఒక గ్రామం ఆదర్శగ్రామంగా తీర్చిదిద్ది తద్వారా మిగతా గ్రామాలలో అభివృద్ధి బాటలో పయనించేలా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విస్తరణ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో యూటీసీ ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు, వైస్ ప్రిన్సిపాల్ పి.పద్మజ, బోధనసిబ్బంది, 40మంది ఎంపీడీఓలు మొదటి బ్యాచ్‌కు హాజరయ్యారు.

పిడుగుపాటుకు ఒకరి మృతి

నకరికల్లు ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లిన రైతు ఉ పిడుగుపాటు గురై మృతి చెందాడు. ఈ విషాద ఘటన కుంకలగుంట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. మండలంలోని కుంకలగుంట గ్రామానికి చెందిన ఊసా నాగేంద్రబాబు (34), చల్లా నాగేశ్వరరావుతో కలిసి విత్తనాలు చల్లేందుకు పొలానికి వెళ్లారు. వర్షం పెద్దది కావడంతో పాటు.. ఉరుములు మెరుపులు రావడంతో పొలం వద్దనే ఉండిపోయారు. ఈ క్రమంలో పిడుగు పడటంతో ఊసా నాగేంద్రబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పాప ఉంది. పొలం పనులకు వెళ్లి మృత్యువాత పడటం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది.

ప్రకాశం బ్యారేజికి తగ్గిన వరద ఉధృతి

● దిగువకు 3,625 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల తగ్గడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 20 వేల 600 క్యూసెక్కుల వరదనీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు నీటి పారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 5 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 3,625క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టాకు 10,271, పశ్చిమ డెల్టా కాలువకు 8,004 క్యూసెక్కుల నీటిని వదలుతున్నట్లు జేఈ తెలిపారు.

విద్యుదుత్పత్తి ప్రారంభం

● 3 క్రస్ట్ గేట్లు ఎత్తి పులిచింతలకు నీరు విడుదల

రెంటచింతల,ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఆదివారం అర్ధ రాత్రి 12 గంటల వరకు 0.9627 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఈఈ సుబ్రహ్మణ్యం చెప్పారు. 3 రేడియల్ క్రస్ట్ గేట్లను ఒకటిన్నర మీర ఎత్తి 21258, రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8,640 మొత్తంగా 29,898 క్యూసెక్కులనీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 29,070 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు అంటే 247.70 అడుగులకు సమానమన్నారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున ప్రాజెక్ట్ నీటిమట్టం సోమవారం నాటికి 586.50 అడుగులు ఉంది. ఇది 302.91 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5,088, ఎడమ కాలువ ద్వారా 8280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,664, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 44,132 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 66,407 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

చిన్ని గుండెకు పెద్దకష్టం

● ఆపరేషన్ ఖర్చులకు దాతల కోసం ఎదురు చూపు
● స్పందించిన రావిపాటి దేవేంద్రరావు 50వేల ఆర్థిక సహాయం అందజేత



వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారి

ముప్పాళ్ళ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చిన్ని గుండెకు పెద్దకష్టం వచ్చింది. అభం శుభం తెలియని ఆ చిన్నారి పుట్టుకతోనే గుండెకు రెండు రంధ్రాలతో జన్మించాడు. వివరాలలోకి వెళితే పల్నాడుజిల్లా ముప్పాళ్ళ మండలం మాదల గ్రామానికి చెందిన షేక్ బాషాకు కుమార్తె ఉంది. ఆమెను డెలివరీ కోసం ఇంటికి తీసుకువచ్చాడు. గత నెల 31వ తేదీన కుమార్తెకు పురిటి నొప్పులు రావడంతో నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ బాషా కుమార్తె నసీమా మగబిడ్డకు జన్మనిచ్చింది. మగబిడ్డ పుట్టాడన్న ఆనందం భార్య భర్తలైన నసీమా, జానీబాషాలతో పాటు బంధువుల ముఖాలలో క్షణాలలో ఆవిరైపోయింది. గుండెకు రెండు రంధ్రాలతో పసిగుడ్డు జన్మించిందని డాక్టర్లు చెప్పడంతో వారు ఆ వార్తను జీర్ణించుకోలేక కన్నీటి పర్యంతమయ్యారు. బిడ్డకు వెంటనే ఆపరేషన్ చేయాలని, తక్షణమే గుంటూరు తీసుకు వెళ్లాలని వైద్యులు చెప్పారు. వారు చిన్నారిని తీసుకుని గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు వెళ్లారు. చిన్నారిని పరిశీలించి తక్షణమే ఆపరేషన్ చేయకపోతే బాబు ప్రాణానికి ప్రమాదమని, ఆపరేషన్‌కు 2లక్షల రూపాయల వరకూ ఖర్చు అవుతుందని చెప్పారు. కాగా బాషాది, అతని కుమార్తె, అల్లుడిది నిరుపేద కుటుంబం. బాషా ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తుండగా, అల్లుడు జానీబాషా కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. దీంతో వీరి బంధువు నాగుర్ వలి చిన్నారి పరిస్థితిని వివరిస్తూ ఆపరేషన్‌కు ఆర్థి సహాయం అందించవలసిందిగా సోషల్ మీడియా వేదికగా అభ్యర్థించాడు.

స్పందించిన దాతలు

చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని దాతలు చెలించిపోయారు. తక్షణమే తమ వంతుగా ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ముప్పాళ్ళ మండలం నార్నెపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు రావిపాటి దేవేంద్రరావు తన వంతుగా చిన్నారి ఆపరేషన్‌కు 50వేల రూపాయలను అందజేశారు. సత్తెనపల్లి సాయికృష్ణ మల్టీస్పెషాలిటి ఆసుపత్రి ఎండీ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, డాక్టర్ సింగరాజు విద్యులు 15 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపరేషన్‌కు ఇంకా డబ్బులు అవసరం అవుతాయని దాతలు స్పందించి 81067 01174 నెంబర్‌ను సంప్రదించాలని బాలుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

రూ.కోట్ల సొమ్ముతో చిట్టీల వ్యాపారి అదృశ్యం

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితులు

గుంటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కోట్లాది రూపాయల చిట్టీల సొమ్ము తీసుకుని.. కుటుంబంతో చిట్టీల వ్యాపారి అదృశ్యమయ్యాడు. దీంతో బాధితులు సోమవారం జిల్లా ఎస్పీని ఆశ్రయించారు. బాధితుల వివరాల మేరకు.. నెహ్రూనగర్ 5వ లైనుకు చెందిన తిరుమలశెట్టి శాంతకుమారి, కుమారుడు సాంబశివరావు, కోడలు దీపిక, వీరి కుమారుడు ప్రభు సాయి తదితరులు సుమారు పదేళ్లుగా.. స్థానికంగా చిట్టీపాటలు నిర్వహిస్తున్నారన్నారు. సుమారు 40 నుంచి 50 మంది వద్ద చిట్టీలు వేశారన్నారు. చిట్టీ పాడుకున్న వారికి డబ్బు ఇవ్వకుండా.. వడ్డీ ఇస్తామని ఆశ చూపి ఆ మొత్తం వారి వద్దే ఉంచుకున్నారు. వాటితో పాటు అనేక మంది వద్ద నగదు రుణంగా తీసుకున్నారన్నారు. గత నెల 13న సాంబశివరావు, భార్య దీపిక, కుమారుడు ప్రభు సాయి ఇంటి నుంచి అదృశమయ్యారన్నారు. తల్లి శాంతకుమారి ఒకటే ఉందని, ఆమెను అడిగితే తిరుపతి వెళ్లారని అబద్ధాలు చెబుతోందని బాధితులు వాపోతున్నారు. అయితే వారు నగరంలోనే వేరే ప్రాంతంలో తలదాచుకుంటున్నారని చెబుతున్నారు. రూ.20 లక్షలు ఇవ్వాలని రంగిశెట్టి శ్రీనివాసరావు, రూ.18 లక్షలు ఇవ్వాలని పులి వెంకటేశ్వరరావు, రూ.10 లక్షల ఇవ్వాలని మేకల లక్ష్మీరెడ్డి, రూ.18 లక్షలు ఇవ్వాలని గోగినేని పద్మ, రూ.నాలుగున్నర లక్షలు ఇవ్వాలని విష్ణుకుమార్.. అదేవిధంగా తమ కూడా పెద్ద మొత్తంలో ఇవ్వాలంటూ పోలేపల్లి పార్వతి, వైసాయి శ్రీనివాస్, రామినేని వెంకటేష్, చెరుకూరి శ్రీనివాసరావు ఇరిగినేని మల్లికార్జునరావు... ఇలా బాధితులు ఎస్పీ కార్యాలయానికి బారులు తీరారు. సుమారు రూ. రెండున్నర కోట్ల వరకు బాధితులకు ఇవ్వాల్సి ఉంటుందని తెలుస్తోంది. ప్రభువు సాయికుమార్ తెనాలి సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతున్నాడని.. ప్రతిరోజు కళాశాలకు వెళుతున్నాడని...బాధితులు అంటున్నారు.



ఎస్పీని ఆశ్రయించిన బాధితులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల, ట్రాఫిక్ ఉల్లంఘన నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇందులో భాగంగా ఈ నెల 4వ తేదీ నుంచి పదో తేదీ వరకు డ్రంకెన్ డ్రైవ్, 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఓవర్ స్పీడ్, 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు హెల్మెట్ ధారణ, 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అన్నిరకాల ఉల్లంఘనలకు ద్విచక్ర వాహనదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను పాటించి వారి విలువైన ప్రాణాలను కాపాడుకోవడానికి పోలీసు అధికారులతో సహకరించాలని కోరారు.

పది రెవెన్యూ గ్రామాలకు పాసు పుస్తకాలు

రొంపిచర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో 14 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి 11 గ్రామాలలో రీసర్వే పూర్తయిందని తహసీల్దార్ బండి నిర్మల సోమవారం తెలిపారు. వీటిలో 10 గ్రామాలకు పాస్ పుస్తకాలు వచ్చాయన్నారు. 13,133 పాస్ పుస్తకాలు వచ్చినట్లు పేర్కొన్నారు. వీటిని ఆగస్టు 15 తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిణీ చేస్తామని తెలిపారు. అదేవిధంగా అరు లైన నిరుపేదలు ఇంటి నివేసిన స్థలాల కోసం రేషన్, ఆధార్, ఓటర్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకువెళ్లి సచివాలయాల్లో దరఖాస్తులు పూర్తిచేసి ఇవ్వాలన్నారు. అనంతరం వాటిని పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్ల వితరణ

రొంపిచర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు భోజనం ప్లేట్లను దాతలు సోమవారం బహూకరించారు. 17వేల రూపాయలు విలువచేసే ప్లేట్లను పొలిమేర వెంకటరెడ్డి, జర్ర వెంకటసాంబశివారెడ్డిలు బహూకరించారు. అదేవిధంగా గత సంవత్సరం 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇరువురికి 5000, 3000రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో కసిరెడ్డి వెంకటరెడ్డి, వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● నరసరావుపేట లీగల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అరండల్‌పేటలోని నంద్యాల వైద్యశాలలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి సోమవారం తెలిపారు. శిబిరంలో సుమారు రూ.3000 విలువగల పరీక్షలు 200మంది ఉచితంగా వినియోగించుకున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యులు బోరుగడ్డ ప్రదీప్‌కుమార్, మౌనికగోపాలం పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మూడో సంవత్సరం బీటెక్ విద్యార్థి సీహెచ్ మారుతి ప్రాసెస్ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు కళాశాల నిర్వాహకులు మిట్టపల్లి చక్రవర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుతి ఈ నెల 21 నుంచి 24 వరకు తాడేపల్లిగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

● నరసరావుపేట రూరల్: తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మానాయుడు, నిర్వాహకులు నాగేశ్వరరావు వెంకట్రావు కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో కాల్ డ్రైవర్లకు పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ జె.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి చదివి హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి ఏడాది గడిచిన వారు సంస్థ నిబంధనలకు లోబడి పనిచేయాలని తెలిపారు. పనిచేసిన ప్రతి దినానికి రూ.800లు వేతనం అందజేస్తామన్నారు.

● శావల్యాపురం: శావల్యాపురం బీసీకాలనీలోని శ్రీసీతారామలక్ష్మణ హనుమత్ సమేత దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. శనివారం నుంచి భక్తులు 3రోజులపాటు యజ్ఞాలు, యాగాలు, హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రోక్తంగా రామాలయం ముందు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు.

● వినుకొండ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వాట్సాప్ గ్రీవెన్స్, మన మిత్ర యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను ఈ నెల 5వ తేదీ ఉదయం 10గంటల నుంచి పురపాలక సంఘ కార్యాలయం నుంచి ర్యాలీ ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● ఈపూరు: మండలంలో మొదటి విడతలో రీసర్వే జరిగిన గ్రామాలకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గుండెపల్లి, వనికుంట, చిట్టాపురం గ్రామాల్లోని రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు సుమారు 2 వేలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాలు ఈ నెల 15వ తేదీ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

● ఈపూరు: మండలంలోని అంగలూరులో సోమవారం శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం ఘనంగా జరిగింది. శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ చైర్మన్ లీలావతి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.

● వినుకొండ: ఈ నెల 17, 18తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట తిరుపతిరావు సోమవారం కోరారు. ఈ సందర్భంగా మార్కాపురం రోడ్డులోని గొర్రెల మండీలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వెంకట్రావు, బాపట్ల జిల్లా కార్యదర్శి బుర్రి ఆంజనేయులు, పల్నాడు జిల్లా నాయకులు కె.వెంకట్రావు, ఐలయ్య, బి.గురవయ్య, ఎ.అంజయ్య, టి.గంగయ్య పాల్గొన్నారు.

ఒక చేతిలో బీజేపీ జెండా.. మరో చేతిలో

కూటమి ఎజెండాతో ముందుకు...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఒక చేతిలో బీజేపీ జెండా, మరొక చేతిలో కూటమి ఎజెండాతో ముందుకు వెళ్లాలని నిర్ణయించామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం కాసు బ్రహ్మానందరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఛాయ్ పే చర్చ నిర్వహించారు. ఉదయాన్నే అక్కడి వచ్చిన పట్టణ వాసులతో ముచ్చటించారు. ఈసందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ అతిపెద్ద వ్యవసాయ క్షేత్రం కలిగిన నరసరావుపేటలో పర్యటించడం ఆనందంగా ఉందన్నారు. దేవుడని గడప కడప నుంచి బీజేపీ అధ్యక్షుడిగా రాష్ట్ర పర్యటన ప్రారంభించానన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, బ్యాంకర్లు, ప్రకృతి వ్యవసాయం సంబంధించిన వారు, అధ్యాపకులు కలవడం ఆనందంగా ఉందన్నారు. నగర ప్రముఖులతో అనేక విషయాలు చర్చించారు. 11 వసంతాల నరేంద్రమోడీ పరిపాలన, 4.1 మన రాష్ట్ర ప్రభుత్వం చేసే తొలి అడుగు కలిపి రాష్ట్రంలో ప్రతి గడపకు తీసుకువెళ్లే పెద్ద ప్రయత్నం జరుగుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆయను సత్కరించారు. ఈ సందర్భంగా



ఛాయ్ పే చర్చలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తదితరులు

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లతో రాక్షసపాలన నుంచి విముక్తిపొంది రాష్ట్రంలో ప్రతి కార్యక్రమం శాంతియుతంగా నిర్వహిస్తున్నారన్నారు. రాబోయే కాలంలో కూడా కూటమి పాలనే ఉండాలన్నారు. ఆ విధంగా ఉన్నప్పుడు రైతులు బాగుంటారని, చదువుకున్న యువతకు ఉద్యోగాలు వస్తాయని వ్యవస్థలు అన్ని బాగుచేసుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. నరేంద్రమోడీ రాష్ట్రాన్ని బాగుచేయటానికి మంచి మనస్సుతో ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కోశాధికారి కోడూరు సాంబశివరావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ప్రతి కార్యకర్త నాయకుడిగా ఎదగాలి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త నాయకుడుగా ఎదగాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట జమీందార్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ విస్తృత కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దీంతో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. పల్నాడు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో, ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగరాలన్నారు. గతంలో పనిచేసిన నాయకులను కలవాలని, అందరినీ కలుపుకు పోవాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి కే శ్రీనివాసరావు, జిల్లా మాజీ అధ్యక్షుడు ఏ సుధాకర్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శులు శెట్టి హనుమంతురావు, ఏబీవీపీ రాష్ట్ర కోశాధికారి కోడూరు సాంబశివరావు, పాతూరి నాగభూషణం, కే సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



యడ్లపాడులోని ఎరువుల గోడౌన్‌లో నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

ఎరువులు, పురుగు మందుల షాపుల్లో తనిఖీలు

వినుకొండ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల షాపుల్లో వినుకొండ తహసీల్దార్ సురేష్‌నాయక్‌తో పాటు వ్యవసాయ శాఖ అధికారి జి.వరలక్ష్మి సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, పురుగుమందుల లైసెన్స్‌లు నమోదు చేసుకున్న ఫారం-ఓలు, బిల్లు పుస్తకాలను, స్టాక్ రిజిస్టార్ ప్రకారం ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు ఫోన్‌చేసి ఎంఆర్‌పీకి ఎరువులు కొనుగోలు చేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, ఏఈవో ఆరిఫ్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: మండలంలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతులకు ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ అర్జున్‌నాయక్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శావల్యాపురంలోని మనగ్రోమోర్, సొసైటీలలో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావుతో కలసి ఆయన సోమవారం తనిఖీలు నిర్వహించారు.

● యడ్లపాడు: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయశాఖకు చెందిన మండల అధికారులు సోమవారం యడ్లపాడులోని రెండు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ముందుగా గ్రామంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి, స్టాకుతో సరిపోల్చారు. అలాగే ధరల పట్టిక బోర్డులను పరిశీలించారు. అనంతరం వీకేపీ ఎరువుల దుకాణానికి చెందిన గోడౌన్‌లోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. రికార్డులకు అనుగుణంగా నిల్వలు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు అధీకృత డీలర్ వద్దనే కొనుగోలు చేయాలని, అలాగే తప్పనిసరిగా బిల్లు పొందాలన్నారు. డీలర్లు ఎరువుల విక్రయాలను ఈ పోస్‌లో నమోదు చేసి బిల్లు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నా, అనధికారికంగా నిల్వలు ఉంచినా వ్యవసాయాధికారికి సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తనిఖీలలో ఇన్‌చార్జి ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, ఏవో హరిప్రసాద్‌లు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామపరిధిలోని ఎరువులు నిల్వచేసిన గిడ్డంగులను జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎం.జగ్గారావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు ఎరువులు మార్క్‌ఫెడ్, సహకార సంఘాలకు ఏ మేర పంపారు అనే విషయంపై స్టాకు రిజిస్టర్లను తనిఖీచేశారు. కాగా నాదెండ్ల, తూబాడు, సాతులూరు గ్రామాల్లోని రిటైల్ ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి శ్రీలత, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో స్వరూపరాణిలు తనిఖీలు నిర్వహించారు.

'సారథ్యం'కు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

వినుకొండ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వినుకొండలో శక్తివంచన లేకుండా బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్బారావు తెలిపారు. నరసరావుపేటలో జరిగే సారథ్యం కార్యక్రమానికి కట్టా సుబ్బారావు ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు సుమారు 40 వాహనాల్లో 400మంది నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నరేంద్రమోదీ నాయకత్వంలో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సారథ్యంలో జిల్లా అధ్యక్షుడు శశికుమార్ ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి అందరూ కలిసి కష్టపడి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు సుజాత, జిల్లా సహాయ కార్యదర్శి జాన్‌బాబు, పార్టీ పట్టణ అధ్యక్షులు కోట సుధాకర్, బండి వెంకటేశ్వర్లు, విశ్వహిందూ పరిషత్ గజవల్లి నాగపవన్‌తో పాటు మండల, గ్రామ, బూత్‌స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్కెన చినరామయ్యకు ఘన నివాళి

వినుకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జీడీసీసీబీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తండ్రి కోటప్పనగర్, పెదకంచర్ల గ్రామ మాజీ సర్పంచ్ మక్కెన చినరామయ్య 8వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు,



చినరామయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

కోటప్పనగర్, గాంధీనగర్, రావిచెట్టుపాలెం వద్ద ఉన్న మక్కెన చినరామయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చినరామయ్య నిరుపేదల కోసం అహర్నిశలు కృషిచేసిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని జీవీ చేతుల మీదుగా ప్రారంభించి పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 106 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఈ సోమవారం కూడా నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొని ప్రజల వద్ద నుంచి వివిధ అంశాలకు సంబంధించిన 106 ఫిర్యాదులను స్వీకరించారు.



ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని రావిపాడు గ్రామానికి ఆంజనేయులు హిమజ ఆటో కన్సల్టెన్సీ స్టాండ్, యూనిటీ ఆటో ఫైనాన్స్ ద్వారా ఫైనాన్స్ తీసుకుని పూర్తిగా చెల్లించానని అయినా పది నెలల నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వకుండా మోసం చేసి ఇబ్బంది పెడుతున్నారని ఎస్పీకి ఫిర్యాదుచేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులు రాసిపెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. దూర ప్రాంతాలనుంచి వచ్చే అర్జీదారుల కోసం భోజన ఏర్పాట్లు చేశారు.

చికిత్స పొందుతూ విద్యుత్ లైన్‌మెన్ మృతి

బొల్లాపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డెంగుంట, నరికొండపాలెం, తండాలకు అసిస్టెంట్ విద్యుత్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న ఒంగోలు ఆంతోనిరాజు (40) రోడ్డుప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచాడు. వివరాల్లోకి వెళితే గత నెల 30వ తేదీన కరెంట్ బిల్లులు వసూలు చేసుకొని వడ్డెంగుంట నుంచి వెల్లటూరుకు వస్తున్న సమయంలో నరికొండపాలెం సమీపంలో ప్రమాదవశాత్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంతోనిరాజుకు గాయాలవ్వడంతో గుంటూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించిచికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై బొల్లాపల్లి ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆంతోనిరాజుది ప్రకాశం జిల్లా గాజులపాలెం. మృతుడికి భార్య నాగమణి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.



కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

యూరియాను బ్లాక్‌లో అమ్ముతున్నారు

● అరికట్టాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి వినతి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో సహకార సంఘాల ద్వారా అందించాల్సిన యూరియా నల్ల బజార్లో యథేచ్ఛగా అమ్ముకొని సొమ్ములు చేసుకుంటున్నారని పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీమంత్రి విడదల రజిని జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు సోమవారం పల్నాడు జిల్లా వైసీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాజీమంత్రి విడదల రజిని, వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, పల్నాడు జిల్లా కలెక్టరును కలిసి రైతులకు కావలసిన యూరియాను తక్షణమే అందుబాటులోకి తీసుకొని రావాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ త్రీమెన్ కమిటీ ఏర్పాటుచేసి తెలుగుదేశం పార్టీ వారికే ప్రభుత్వ సొసైటీలలో ఎరువులు ఇస్తున్నారని ఆరోపించారు. రైతులకు పార్టీ ముద్ర వేయకుండా ఎరువుల అందజేయాలని డిమాండ్ చేశారు.

తల్లిపాల వారోత్సవాలు

వినుకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏనుగుపాలెం సెక్టార్ పరిధిలోని పెదకంచర్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వ హించారు. కార్యక్రమంలో భాగంగా తల్లులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సూపర్‌వైజర్ దేవీబాయి తల్లిపాలపై అవగాహన కల్పించారు. క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాగమల్లేశ్వరి, ఝాన్సీరాణి, సులోచన, శివకుమారి, పద్మ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు నాగమణి, సుజాత, ఏసమ్మ తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని ఏ సెక్టారు పరిధిలోని లైబ్రరీ బజారు అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి సూపర్‌వైజర్ శేషకుమారి పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

● యడ్లపాడు: శిశువుల శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో దోహదపడతాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎన్.అరుణకుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండలంలోని సొలస, యడ్లపాడు సెక్టార్ల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. లింగారావుపాలెం ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిపాలు శిశువులను అంటువ్యాధుల నుంచి రక్షించడమే కాకుండా ఎదుగుదలకు దోహదం చేస్తుందన్నారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కే శిరీష, ఆరోగ్య కార్యకర్తలు పద్మ, పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన తృతీయ సోపాన శిక్షణ

నాదెండ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయంలో నాలుగురోజులుగా జరుగుతున్న తృతీయ సోపాన శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జేఎన్‌టియూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను ఈ స్థాయికి రావడానికి ప్రధాన కారణం స్కౌట్స్, గైడ్స్‌లో చేరడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ఉన్నత చదువుల్లో 4శాతం రిజర్వేషన్ ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీరజ్‌కుమార్ శ్రీవాస్తవ, విజయ్‌కుమార్, రవీందర్, రామకోటి పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠ

నాదెండ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూబాడులో గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. జీర్ణోద్ధరణలో భాగంగా పోలేరమ్మతల్లి దేవాలయ ప్రాంగణంలో పూర్ల అంకమ్మతల్లి, అంకమ్మతల్లి, పోతురాజుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. తొలుత విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. యాగాలు నిర్వహించి ప్రత్యేక పూజల మధ్య ప్రతిష్ఠించారు.



పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ పాఠశాల వద్ద శిథిలావస్థలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వినుకొండ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ప్రమాదకరంగా మారింది. ఇటీవల అడపాదడప కురిసిన వర్షాల తాకిడికి నాశిరకం నిర్మాణాల కారణంగా నెర్రెలిచ్చి నేలకూలేందుకు సిద్ధంగా ఉంది. పక్కనే పాఠశాల ప్రహరీ ఉండటంతో దీంతో విద్యార్థులు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై పాఠశాల ఉపాధ్యాయులు విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోకపోవడంతో విద్యార్థులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి శిథిలమైన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



బీమా చెక్కులను బాధిత కుటుంబాలకు అందచేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

కార్యకర్తల కుటుంబాలకు అండ చంద్రన్న బీమా

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సంక్షేమం కోసం చంద్రబాబు ప్రవేశపెట్టిన చంద్రన్న బీమా లక్షలాది కుటుంబాలకు గొప్ప దీమాగా నిలుస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును సోమవారం అన్నారు. చిలకలూరిపేట పట్టణానికి చెందిన దాసరి పున్నారావు, యడ్లపాడు మండలం మైదవోలు గ్రామానికి చెందిన పల్లపు పోతురాజు ఇటీవల వేరు వేరు దుర్ఘటనలలో ప్రమాదవశాత్తూ మరణించిన నేపథ్యంలో ఒక్కో కుటుంబానికి పార్టీ అందించిన రూ.5లక్షల విలువైన బీమా చెక్కులను ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్తిపాటికి అందించారు. పార్టీ కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ అధినాయకత్వం ఎనలేని ప్రాధాన్యం ఇస్తోందని, ప్రమాదవశాత్తూ మరణించిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడం, కార్యకర్తల పిల్లల యోగక్షేమాలు, చదువుసంధ్యలు చూడటంలో పార్టీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా లోకేశ్ బాధ్యతలు చేపట్టాక పార్టీకి యువరక్తం ఎక్కించి నూతనోత్తేజం తీసుకొచ్చారని, లోకేశ్ సారథ్యంలో పార్టీ ఇటీవలే కోటి సభ్యత్వాలు పూర్తిచేసుకుందని, ఇది అందరికీ గర్వకారణమని వివరించారు.

సీడీపీవోగా శాంతకుమారి బాధ్యతల స్వీకారం

నరసరావుపేట రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నరసరావుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిగా నియమితులైన నేలపాటి శాంతకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టులో గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై సీడీపీవోగా నరసరావుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు ఒకటి నుంచి ఏడో తారీఖు వరకు జరుగుతున్న తల్లిపాల వారోత్సవాల గురించి తల్లిపాల ప్రాముఖ్యత గురించి అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాలు తల్లులకు, గర్భవతులకు బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు.



నేలపాటి శాంతకుమారి



విజేతలతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో ఐడీపీఎస్‌కు తొలి స్థానం

నరసరావుపేట రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో నిర్వహించిన 19వ ఆంధ్రప్రదేశ్‌స్టేట్ ఫ్లోర్‌బాల్ చాంపియన్‌షిప్ (అండర్ -14 కేటగిరీ) పోటీలలో 13 జిల్లాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నరసరావుపేట నుంచి పాల్గొన్న విద్యార్థులు ఉత్తమ ప్రదర్శనతో మొదటి స్థానాన్ని సాధించారు. బాలుర కేటగిరీల్లో ఐడీపీఎస్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ఐడీపీఎస్ చైర్మన్ నాగోతు ప్రకాష్‌రావు, డైరెక్టర్ నాగోతు సబిత, ప్రిన్సిపాల్ రేఖ ఫులేకర్ విజేతలను అభినందిచారు.

పురుషోత్తమపట్నంలో ఘర్షణపై కేసు నమోదు

చిలకలూరిపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురుషోత్తమపట్నంలో సోమవారం రెండు కుటుంబాల మధ్య స్థలం దారి విషయమై వివాదం చెలరేగింది. వివాదం కారణంగా జరిగిన ఘర్షణలో గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు తేలప్రోలు రామమూర్తి కుమారుడు అయ్యప్ప (40) తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఈ సంఘటనకు సంబంధించి వైసీపీ నాయకుడు బండ్ల శ్రీనివాసరావుతో పాటు మరికొందరిపై బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై అర్బన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సంఘటనా స్థలాన్ని అర్బన్ సీఐ పి.రమేష్ పరిశీలించారు.

రైతులను దగా చేసిన కూటమి : మాజీ ఎమ్మెల్యే బొల్లా

ఈపూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా దగా చేసిందని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఈపూరు శ్రీనివాస్ కల్యాణ మండపంలో సోమవారం వైసీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ కే నాగేశ్వరరావు, గోల్ వెంకటేశ్వరరావు, బొల్లా బుజ్జి, నరసారెడ్డి, మందపాటి రామారావు, కొలగాని యాగయ్య, కాకనబోయిన శ్రీని వాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు మృతి

నాదెండ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్రు గ్రామానికి చెందిన పాలుత్పత్తిదారుల సంఘం మాజీ అధ్యక్షుడు పూదోట దుప్పినయ్య (79) మృతిచెందారు. ఆయన సుమారు 25సంవత్సరాలపాటు పాలకేంద్రం అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ సందర్శించి నివాళులర్పించారు. అంతిమయాత్రలో టీడీపీ నాయకులు బి.సింగయ్య, ఎం.జయప్రసాద్, ఎన్.చిన్నయ్య, మరియదాసు, జరుగుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.